
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 42.0 | కనిష్ఠం : 28.0

ANDHRAJYOTHY

1



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

బీజేపీ రోడ్ షో సక్సెస్

- భరత్ ప్రసాద్ నామినేషన్ దాఖలు - పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్



రోడ్ షోలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 25: బీజేపీ నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్‌ప్రసాద్ తన మూడో సెట్ నామినేషన్ అనంతరం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయ్యింది. బస్ డిపో నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్, కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరయ్యారు. మహిళల కోలాటాలు, కళాకారుల డప్పులు, కార్యకర్తల బైక్ ర్యాలీతో పట్టణమంతా కాషాయ మయమైంది. ర్యాలీ అంబేడ్కర్ కూడలికి చేరుకోగానే బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథులతో పాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజీ ఆచారి, ఎంపీ పోతుగంటి రాములు, అభ్యర్థి భరత్ ప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ పూటకో పార్టీ, గంటకో పార్టీ మారే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎప్పుడో ఎంపీగా పని చేసిన మల్లు రవిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ తాను ఎంపీగా పని చేసిన ఐదేళ్ల కాలంలో ఏం చేశారని ప్రశ్నించే వారు తన హయంలోనే కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు రూ.1,500 కోట్లతో జాతీయ రహదారి తెచ్చిన సంగతి గుర్తించాలన్నారు. ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ కాకుండా అడ్డుకున్న నాడే ఎంపీగా చట్ట సభల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాను అని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపిస్తే మోదీ ఆశీర్వాదంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటు ఎన్నికల చీఫ్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దిలీప్, నాయకులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్, పక్కన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

నల్లమల ప్రాంతం నాకు చదువు నేర్పింది

» బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



అచ్చంపేటలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అచ్చంపేటటౌన్/అమ్రాబాద్, ఏప్రిల్ 25: నల్లమల ప్రాంతం తనకు చదువు నేర్పిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నర్సింహ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మద్దిమడుగు అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

పదర మండల పరిధిలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికలలో ప్రచారాన్ని ఆయన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇప్పలపల్లి, ఉడిమిళ్ల, వంకేశ్వరం, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్, వరకు రోడ్ షో ద్వారా ప్రజలను కలుస్తూ తన ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

తుమ్మిళ్ల రిజర్వాయర్లను పూర్తి చేస్తాం

» ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

» అలంపూర్, ఉండవల్లిలలో ప్రచారం

అలంపూర్/ ఉండవల్లి, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేసి సాగునీరు అందిస్తామని, ప్రతీ పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అలంపూర్, ఉండవల్లి మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లురవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి చైర్మన్ చిన్నకృష్ణయ్య నాయుడు, ఈవో పురేందర్‌కుమార్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, శేషవస్త్రాలు అందించి సత్కరించారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకీ మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటు రాదని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందవని మాజీ సీఎం కేసీఆర్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలంపూర్ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తుమ్మిళ్ల లిఫ్టుకు సంబంధించిన మూడు రిజర్వాయర్లను పూర్తి చేసి 81,000 ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. గొప్ప మాటలు చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రస్తుత ఎంపీ రాములు ఏమీ చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డికి 24 గంటల చేదోడువాదోడుగా ఉన్న మల్లు రవి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు శంషాద్ ఇస్మాయిల్, ఎంపీపీ బేగంగోకారి, మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము, నాయకులు పెద్దబాబు, మహేష్ గౌడ్, ఆర్ఎస్ ప్రసన్నకుమార్, బీసమ్మ, గోపాల్, నాగరాజు, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలి

కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేయడం మనందరి బాధ్యతని నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. అలంపూర్ పట్టణంలో గురువారం మంత్రి జూపల్లి రోడ్ షో అనంతరం హరిత టూరిజంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో చర్చించి మూడు రిజర్వాయర్లను పూర్తి చేసే బాధ్యత తనదేనన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, మాజీ సీఎం కేసీఆర్‌లు కవల పిల్లల్లాంటి వంటి వారన్నారు. బీఆర్ఎస్‌ను గద్దె దించామని, త్వరలో బీజేపీని కూడా గద్దె దించుతామన్నారు. కేసీఆర్‌ను ప్రశ్నించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆయన వద్దకే చేరి బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలిచాడని, ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీగా తాను గెలిచిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ. 100 కోట్లతో అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, ఏప్రిల్ 25 : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరు కురుమూర్తి(35) కొంతకాలంగా ఎలాంటి పని లేకుండా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం భార్యతో గొడవపడి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

నగదు పట్టివేత

గోపాల్‌పేట, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రూ.52వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన రాములు తన వద్దనున్న రూ.52 వేల నగదుకు సంబంధించి ఎలాంటి రశీదు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

పోలీస్ తనిఖీల్లో రూ. 9,58,290 సీజ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 9,58,290 పట్టుకున్నట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1,72,000, బల్గెర చెక్‌పోస్టు వద్ద రూ. 65,000, అయిజ పట్టణంలో రూ.90,000 సీజ్ చేశారు. మల్దకల్ మండల కేంద్రంలో రూ.70,000, ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని జింకలపల్లి స్టేజీ వద్ద రూ. 2,50,000, గద్వాల పట్టణంలో రూ. 2,60,000, అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ర్యాలంపాడు చెక్‌పోస్ట్ దగ్గర రూ. 50,790 నగదు లభ్యమైంది. మొత్తం రూ. 9,58,290ను స్వాధీనం చేసుకొని జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు.

రూ. లక్షా పద్నాలుగు వేలు పట్టివేత



కర్నూల్ జిల్లాకు చెందిన షేక్ నూర్ హమ్మద్ నుంచి రూ. 56 వేల నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ తిరుపాజి

బాలానగర్, ఏప్రిల్ 25 : ఎన్నికల కోడు అమలులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. లక్షకు పైగా నగదు పట్టుబడింది. స్థానిక ఎస్ఐ తిరుపాజి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా, హసనాపురానికి చెందిన షేక్ నూర్‌హమ్మద్ వద్ద రూ.56 వేలు, వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌కు చెందిన ఆంజనేయులు వద్ద రూ. 58వేలు కనిపించడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టు బడిన డబ్బులకు సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చని ఎస్ఐ తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ప్రతిభ' విద్యార్థుల దూకుడు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల గౌరవ సలహాదారులు, యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్ తుది ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు దూకుడు ప్రదర్శించారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ విద్యార్థి ఎన్.ప్రవీణ్ ఆల్‌ఇండియా కేటగిరిలో 8వ ర్యాంకు సాధించగా, కె. స్వర్ణ జాతీయస్థాయి 25వ ర్యాంక్, కార్తిక్ సాగర్ 99.83 పర్సంటైల్, ఎ.గణేష్ 99.40 పర్సంటైల్, బి. అనిరుధ్‌గౌడ్ 98.22 పర్సంటైల్, బి. శ్రీకాంత్ 98.61 పర్సంటైల్, శ్రీను 97.62 పర్సంటైల్, సాయిఈశ్వర్ 96.76 పర్సంటైల్, ఉమేష్‌చంద్ర 95.05 పర్సంటైల్, ఎ. హంసిని 93.97 పర్సంటైల్, విష్ణువర్ధన్ రెడ్డి 93.14 పర్సంటైల్, వర్షిక 92.92 పర్సంటైల్, శ్రీకాంత్ 92.39 పర్సంటైల్, నవ్యశ్రీ 92.21 పర్సంటైల్, అరవింద్ 91.60 పర్సంటైల్, నిఖిత 91.10 పర్సంటైల్ సాధించారు. 55 మందికి 90 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల గౌరవ సలహాదారులు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య, వెంకట్రామయ్య, ఎస్. వెంకట్ రెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

జేఈఈలో 'రిషి' విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో కళాశాల ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి



జీ. సాకేత్‌సింగ్ 99.60



కే.కౌశిక్ యాదవ్ 98.87

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ తుది ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి నీట్, ఐఐటీ అకాడమీ, జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగుర వేశారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కళాశాలకు చెందిన జి.సాకేత్ సింగ్ 99.60 పర్సంటైల్ కె.కౌసిక్ యాదవ్ 98.87 పర్సంటైల్, వినయ్‌రెడ్డి 98.67 జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించి అగ్ర భాగాన నిలిచారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చంద్రకళావెంకట్, ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిబాబు అభినందించారు. సాకేత్‌సింగ్ ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్ సాధించగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఇంటర్ ఫలితాల్లో 'అక్షర' విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులతో కళాశాల కార్యదర్శి ఫణిప్రసాద్, తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : ఇంటర్మీడియట్ మొదటి, రెండవ ఏడాది పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంటర్ ఫలితాల్లో అక్షర కళాశాలకు చెందిన రెండవ ఏడాది ఎంపీసీ విభాగానికి చెందిన సుహరిత్ భరద్వాజ 1000 మార్కులకు గాను 988 మార్కులు, పి. శిరీష 976, గాయత్రి, నేహతబస్సుం 973, త్రిపుర 967, రేశ్మిత 946 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఆమేనా తబస్సుం 974 మార్కులు అసియా తబస్సుం 960, అప్మసిద్దికి 953 మార్కులు సాధించారు. మొదటి ఏడాది బైపీసీ విభాగంలో కుమారి అయేషాఇస్రాసిద్దికి 440 మార్కులకుగాను 437 మార్కులు, భార్గవి 436, లక్ష్మీప్రియ 436, సానియాఆఫ్సైన్ 436 సౌమ్య 431 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో అఖిల్‌గౌడ్ 470 మార్కులకు గాను 462 మార్కులు, కృతిశ్రీ 460, కౌశిక 457 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కార్యదర్శి ఫణిప్రసాద్, డైరెక్టర్, అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థులను గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం..!

- మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి 32 మంది అభ్యర్థుల నామినేషన్
- నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి 34 మంది నామినేషన్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల్లో తొలి అంకం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు గురువారం ఆఖరు కావడంతో మహబూ బ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 32 మంది అభ్యర్థులు 58 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి జి. రాకేష్, స్వతంత్ర అభ్యర్థి కారుకొండ శ్రీనివాసులు నాలుగు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి హరీందర్‌రెడ్డి మల్లెల మూడు సెట్ల నామినేషన్ పత్రాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి గుగులోత్‌కు అందజేశారు.

- నాగర్‌కర్నూల్ పార్లమెంటుకు మొత్తం 34 అభ్యర్థుల నుంచి మొత్తం నామినేషన్ల సంఖ్య 53

నామినేషన్ వేసిన అభ్యర్థులు వీరే..

అభ్యర్థి పేరు	పార్టీ
1) డీకే అరుణ	బీజేపీ
2) చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్
3) మన్నె శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్ఎస్
4) ఈరమోని సురేందర్	స్వతంత్ర
5) జి. రాకేష్	ధర్మ సమాజ్ పార్టీ
6) కారుకొండ శ్రీనివాసులు	స్వతంత్ర
7) కండిత శేఖర్‌రెడ్డి	విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ
8) అందారి అంజయ్య	స్వతంత్ర
9) హరీందర్‌రెడ్డి మల్లెల	స్వతంత్ర
10) మహ్మద్ అల్లావుద్దీన్	బహుజన్ సమాజ్ పార్టీ 2
11) వెంకటరమణ	స్వతంత్ర
12) కాయ్ జంగయ్య	స్వతంత్ర
13) వెంకటేశ్వర్లు తల్లాడ	అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ
14) సబావత్ విజయ	స్వతంత్ర
15) సబావత్ శ్రీనివాస్	స్వతంత్ర
16) గంబావతు దినేశ్	స్వతంత్ర
17) మహ్మద్ అబ్దుల్ రహీమ్	స్వతంత్ర
18) హనుమేష్	స్వతంత్ర
19) నడిమికంటి శ్రీనివాసులు	స్వతంత్ర
20) ముడావత్ బాలరాజు నాయక్	స్వతంత్ర
21) పి. సందీప్‌కుమార్‌రెడ్డి	స్వతంత్ర
22) కె. రామలింగప్ప	స్వతంత్ర
23) బండ సత్యనారాయణ	స్వతంత్ర
24) గోవిందమ్మ	స్వతంత్ర
25) బుయ్యకారి రవీందర్	సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా
26) ఎన్. నరేష్‌రెడ్డి	తెలంగాణ జాగీర్ పార్టీ
27) విష్ణువర్ధన్‌రెడ్డి తపాలకింది	స్వతంత్ర
28) అనీసుర్ రెహ్మాన్	బహుజన్ ముక్తి పార్టీ
29) సంగపాగ సరోజనమ్మ	స్వతంత్ర
30) షేక్ మున్నా బాషఆల్ ఇండియా	మజ్లిస్ ఈ ఇత్తేదుల్ ముస్లిమిన్
31) ఉమాశంకర్ నెమ్మికంటి	స్వతంత్ర
32) మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్	స్వతంత్ర

పాలమూరుకు గులాబీ బాస్

- నేడు మహబూబ్‌నగర్.. రేపు నాగర్‌కర్నూల్‌లో బస్సు యాత్ర
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి కేసీఆర్ పాలమూరు పర్యటన



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పాలమూరు జిల్లా పర్యటనకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటికే బస్సు యాత్ర ప్రారంభించిన కేసీఆర్.. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో, శనివారం నాగర్‌కర్నూలులో పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని 14 స్థానాలకు గాను రెండు స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటి.. పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే నిరాశలో ఉన్న పార్టీ కేడర్‌ను ఉత్తేజ పరిచేందుకు కేసీఆర్ పార్లమెంట్ నియోజకవర్గాల పర్యటనను చేపట్టారు.

ఇటీవల జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఐదేళ్లు మంత్రులుగా ఉన్న వారు కూడా భారీ తేడాతో ఓటమి చెందారు. అప్పటి నుంచి కేడర్‌లో నైరాశ్యం ఏర్పడింది. కాంగ్రెస్, బీజేపీలు చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో చాలామంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు బీజేపీలో చేరి.. ఆ పార్టీ నుంచి తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు ఎంపీ టిక్కెట్ దక్కించుకున్నారు.. వనపర్తి జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాగర్‌కర్నూలు కీలక నాయకుడు జక్కా రఘునందన్‌రెడ్డి బీజేపీలో చేరారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా.. పలు మునిసిపాలిటీల్లో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు, రాజీనామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది.

అభ్యర్థులను గెలిపించుకునేందుకే..

గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మొదటిసారి పోటీచేసి 77,829 మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కూడా ఆయననే అభ్యర్థిగా బీఆర్ఎస్ ఖరారు చేసింది. ఈ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పోలిస్తే కాస్త ఆలస్యంగా ప్రచారం ప్రారంభించినప్పటికీ.. ప్రస్తుతం పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గతంలో ఏడుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వారే గెలవగా.. ఇప్పుడు పరిస్థితి తలకిందులై.. మొత్తం ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే గెలవడం బీఆర్ఎస్‌కు కొంత బలహీతగా చెప్పవచ్చు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీచేసిన పీ రాములు 1.89 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆయన బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు బీజేపీ టిక్కెట్ ఖరారు చేసింది. ఈ పార్లమెంట్ పరిధిలో గద్వాల, అలంపూర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆ పార్టీ అభ్యర్థిగా నిలిపింది. ఆయన ఈ పార్లమెంట్‌కు స్థానికుడు కావడం.. ఇంకా బీఆర్ఎస్ కేడర్ క్షేత్రస్థాయిలో ఉండటం బలం కాగా.. మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండటం.. కొంతమంది నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరడం కొంత బలహీనతగా చెప్పవచ్చు. గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన పార్టీ.. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడి.. పార్లమెంట్ ఎన్నికల ద్వారా పూర్వవైభవం కోసం ప్రయత్నిస్తోంది. ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకునేందుకు కేసీఆర్ ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో బస్సు యాత్ర చేపట్టారు.

పార్లమెంట్ ఎన్నికలు.. పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సౌరభ్, సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, పోలీస్ అబ్జర్వర్ అమోగ్ జీవన్ గోయింగ్కర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాకు నియమించబడిన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సౌరభ్, సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, పోలీస్ అబ్జర్వర్ అమోగ్ జీవన్ గోయింగ్కర్‌లు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు, పోలీస్ అబ్జర్వర్స్, ఎక్స్పెండించర్ అబ్జర్వర్‌లతో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం.సంతోష్, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్, వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కే.మూర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నగేష్, గద్వాల అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అబ్జర్వర్స్ మాట్లాడుతూ ఎన్నికలను స్వేచ్ఛగా పారదర్శకంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమాయత్తం కావాలని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చును జాగ్రత్తగా అంచనా వేయాలని, వారి ప్రతి కదలికలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల నోడల్ ఆఫీసర్లు ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సూపర్‌విజన్ చేయాలని, మానిటరింగ్ టీమ్స్ అభ్యర్థుల ప్రతీ కదలికలను, ప్రతి ఖర్చును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు జిల్లాల అధికారులతో మొదటి సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలైన్స్ వీడియో సర్వేయలైన్స్ వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ, కంట్రోల్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సాధారణ, ఎన్నికల పరిశీలకులు ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారని, జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. మ్యాన్‌పవర్ నిర్వహణలో భాగంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, నియామకం, ర్యాండమైజేషన్ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించాలని శిక్షణ నిర్వహణలో భాగంగా ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనే అధికారుల సామర్థ్యం పెంపుదల, శిక్షణ, వేదికల ఏర్పాట్లు, సామగ్రి పంపిణీ, రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణ కోసం నియమించబడిన ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యం

- ఇబ్బంది పడిన ప్రయాణికులు



జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో ఎండలో నిల్చున్న ప్రయాణికులు

ఉండవల్లి, ఏప్రిల్ 25 : జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని జోగుళాంబ రైల్వే స్టేషన్‌కు గురువారం తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు గంటన్నర పాటు ఆలస్యంగా వచ్చింది. మధ్యాహ్నం 3.15 గంటలకు రావలసిన రైలు సాయంత్రం 4.45 నిమిషాలకు వచ్చింది. దీనితో గంటన్నర పాటు ప్రయాణికులు ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. స్టేషన్ హాల్ చిన్నదవడం, కనీసం తాగు నీరు అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మూత్రశాలలు లేక మహిళలు అసహనం వ్యక్తం చేశారు. దీనికి తోడు స్టేషన్లో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. స్టేషన్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరారు.

అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత

- ఖాళీగా 62 టీచర్, 173 హెల్పర్ పోస్టులు
- సక్రమంగా సాగని పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



గద్వాలలో మూడవ వార్డులో మూతపడిన కేంద్రం

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 25 : జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఆయా కేంద్రాల నిర్వహణకు ఇబ్బంది కలుగడంతో పాటు చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా సాగడం లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 713 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో గద్వాల అర్బన్ పరిధిలో 262, రూరల్ పరిధిలో 213, మానవపాడు మండలంలో 238 కేంద్రాలున్నట్లు అధికారులు చెప్తున్నా రు. జిల్లాలో గర్భిణులు 5,785, బాలింతలు 3,389, మూడేళ్లలోపు చిన్నారులు 28,104, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 23,844 మందితో మొత్తంగా 61,122 మంది ఉన్నారు. వీరికి అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, గుడ్లు, ఆహారం పంపిణీ చేయాల్సి ఉంది. కానీ టీచర్లు, ఆయాల కొరతతో పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

జిల్లా కేంద్రంలోనే ఎక్కువ ఖాళీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉన్నవారితోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. జిల్లాలో 62 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 173 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. కానీ ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉన్న ట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా కేంద్రంలోనే ఎక్కువ ఖాళీలు ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని హమాలీకాలనీ, పిల్లిగుండ్ల, వేణుకాలనీ, చింతలపేటలతో పాటు మరికొన్ని కాలనీల్లోని అంగన్‌వాడీల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాతహౌసింగ్‌బోర్డుకు చెందిన ఓ అంగన్‌వాడీ టీచర్ ఇటీవల రాజీనామా చేశారు. ఈ క్రమంలో కొన్ని కాలనీల్లోని కేంద్రాలను ఇతర ప్రాంతాలకు మార్చారు. మూడవ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా లేకపోవడంతో ఇతర కేంద్రాల టీచర్లు అప్పుడప్పుడు వచ్చి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిహాకారం పంపిణీ చేస్తున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మహిళలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అంగన్‌వాడీల్లో టీచర్లు, ఆయాల కొరత ఉన్నది వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉ న్నందున సిబ్బందిని నియమించే అవకాశం లేదు. ఎ న్నికల అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం.

- సుధారాణి, జిల్లా సంక్షేమాధికారి

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 25: గత కొన్ని రోజులుగా ఆరోగ్య కారణాల వల్ల చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన బొల్లు కృష్ణయ్య (46) ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన బంగారమ్మతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 సంవత్సరాలు బాలుడు ఉన్నాడు. వృత్తి రీత్యా కల్వకుర్తిలోని హోటల్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య స్వస్థలం అయిన మాదారం గ్రామానికి రాకపోకలు సాగిస్తుండే వాడు. అనారోగ్యం పాలైన వ్యక్తికి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులు భార్య బంగారమ్మపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దాంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల, ఏప్రిల్ 25 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని జిల్లెడుబండ గ్రామానికి చెందిన అనంతమ్మ(48) కృష్ణ దంపతుల మధ్య ఈ నెల 23న ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా భర్త మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ విషయంపై ఆమె తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. అనంతమ్మ, కృష్ణ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఉప్పునుంతల, ఏప్రిల్ 25 : విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పూర్యతండా గ్రామానికి చెందిన నేనావత్ పాండు పెనిమిళ్ల గ్రామంలో వరి గడ్డి కొనుగోలు చేశారు. ఉదయం ట్రాక్టర్‌లో వరి గడ్డిని నింపుకొని స్వగ్రామమైన పూర్యతండాకు తీసుకెళుతుండగా పెనిమిళ్ల సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో గడ్డికి నిప్పు అంటుకొని మంటలు చేలరేగాయి. రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నా అదుపులోకి రాకపోవడంతో అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపే మంటలు మరింత తీవ్రతరం కావడంతో అప్రమత్తమైన రైతులు వెంటనే ట్రాక్టర్ ఇంజన్లు వేరు చేశారు.

అగ్ని మాపక కేంద్రం మంటలు ఆర్పేలోపే ట్రాక్టర్ ట్రాలీ టైర్లు గడ్డి పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామ స్థులు తెలిపారు. దాదాపు 80 వేల వరకు నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

మద్యం పట్టివేత

రాజోలి, ఏప్రిల్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామానికి చెందిన కుమార్‌గౌడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుమార్‌గౌడ్ గ్రామంలోని తన కూల్‌డ్రింక్ షాపులో విక్రయించేం దుకు రాజోలి నుంచి మద్యాన్ని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా, హెడ్ కానిస్టేబుల్ ఈరన్న తనిఖీ చేశారు. అతడి వద్ద దాదాపు రూ.13వేల విలువైన మద్యం లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మానాజీపేటలో..

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మానాజీపేట గ్రామంలో గురువారం 11.37 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సత్యంగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన గాజులపేట వెంకటయ్య ఇంటి వద్ద అధిక ధరకు మద్యాన్ని విక్రయించేందుకు గాను నిల్వ ఉంచుకోగా దాడి చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, బుధవారం రాత్రి వెనికితండాకు చెందిన విస్లావత్ మహేష్ 31.20 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా మండల కేంద్ర శివారు ప్రాంతం పర్వతాపూర్ రోడ్డుపై మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరురూరల్, ఏప్రిల్ 25 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవారావు తెలిపారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాగాపూర్ గ్రామం నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకొని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఇసుకతో పాటు, వాహనాలకూ సరైన పత్రాలు లేవని ఆయన చెప్పారు.

తుమ్మిళ్ల గ్రామ సమీపంలో..

రాజోలి, ఏప్రిల్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగ్రామానికి చెందిన చెందిన బోయ వెంకట్రాముడు అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది దాడులు నిర్వహించగా పెద్ద తాండ్రపాడు గ్రామం దర్గా వద్ద ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీటీసీ పరీక్ష ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 25 : గత ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు డీఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉతీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 1 నుంచి జూన్ 13 వరకు 42 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంటుందని తెలిపారు.

పరస్పర దాడి ఘటనలో డీఎస్పీ విచారణ

ఆత్మకూరు, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీలో ఇరువర్గాలు చేసుకున్న దాడి ఘటనపై గురువారం డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టినట్లు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీలో గత ఆదివారం గద్దమీద శ్రీనివాసులు, రేవల్లి శ్రీనివాసులుకు చెందిన ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ విషయంపై ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన డీఎస్పీ ఆదేశం మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహం చేస్తున్న వారిపై కేసు నమోదు

రేవల్లి, ఏప్రిల్ 25 : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కేశంపేట పాత తండాలో బాల్య వివాహం చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట పాత తండాకు చెందిన పదహారేళ్ల బాలికను ఆమె తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల వెంకటేష్‌తో బాల్య వివాహం జరుపుతున్నారు. తమకందిన సమాచారం మేరకు తండాకు వెళ్లి విచారించామని, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బాలికతో పాటు, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దోమలు పుట్టకుండా చూసుకుందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్

కందనూలు, ఏప్రిల్ 25 : దోమలు పుట్టకుండా చూసుకుందామని, మలేరియాను తరిమికొడుదామని జిల్లా ఇమ్యూనైజేషణ్ అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ ఆఫీస్ ప్రాంగణంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ మలేరియా నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా వ్యాధి సోకినప్పుడు దోమలను చంపడానికి ప్రజారోగ్య శాఖ నిర్వహించే మందుల పిచికారి కార్యక్రమానికి సహకరించి విధిగా ఇంట్లో స్ప్రే చేయించుకోవాలని సూచించారు. జిల్లా మాస్ మీడియా అధికారి నరసింహ, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్.శ్రీనివాసులు, స్థానిక మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి, పర్యవేక్షణ అధికారి కేశవులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● వంగూరు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం వంగూరులో వైద్యసిబ్బంది మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ శ్రుతి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమలు కుట్టకుండా చూసుకొందాం మలేరియాను తరిమికొడదామని ఆమె అన్నారు. ప్లాస్మోడియం అనే పరన్నజీవి మనుషుల రక్తంలోకి ప్రవేశించడం ద్వారా మలేరియా వస్తుందని అన్నారు. మలేరియా జ్వరం ప్రధానంగా జూన్ మాసం నుంచి నవంబరు మధ్య కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని అన్నారు. దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కలిగి ఉండి దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సీహెచ్‌వో సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రమోద్‌కుమార్, పద్మ, రోజమ్మ, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మలేరియా నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి బిక్కనాయక్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా దోమతెరలు వాడడం దోమ కుట్టకుండా తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలి, పీహెచ్ఎస్ జోన్స్, హెల్త్ అసిస్టెంట్లు జగదీష్, రమేష్, శ్రీనయ్య ఏఎన్ఎంలు సావిత్ర, నిర్మల, సరిత, దేవికబాయి తదితరులు ఉన్నారు.

● కొల్లాపూర్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇటికల రామారాజుయాదవ్ అధ్యక్షతన జంతు శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామారాజుయాదవ్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో ప్రకారం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ రమేష్‌కుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



చిన్నపీరు తండా పంచాయతీలో కబ్జా చేసిన ప్రభుత్వ రెవెన్యూ భూమి

బిజినేపల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని చిన్నపీరుతండా పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 479లోని 30 ఎకరాల ప్రభుత్వ రెవెన్యూ భూమిలో ఒక ఎకరం భూమిని కబ్జా చేసిన హనుమంత్ నాయక్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గురువారం నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తండావాసులు తెలిపారు. 30 ఎకరాల్లో మరికొందరు కూడా కబ్జా చేసి కోళ్లఫారాలు కట్టుకోవడంతో పాటు ప్లాట్లు చేసి విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని సర్వే చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ఇవ్వాలని కోరారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

- సలేశ్వరం కొండ నుంచి వృద్ధురాలిని ఎత్తుకొచ్చిన కానిస్టేబుల్



వృద్ధురాలిని మోసుకొస్తున్న కానిస్టేబుల్ రాందాస్

అచ్చంపేట, ఏప్రిల్ 25: సమాజ శ్రేయస్సు కోసం చట్టాలను రక్షించే పోలీసులు కొన్ని సందర్భాలలో మానవత్వం చాటుకుంటూ శభాష్ అనిపించుకుంటు న్నారు. సలేశ్వరం ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం 5గంటల సమయంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన వెంకటమ్మ అనే వృద్ధురాలు స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో కొండలు ఎక్కలేక వయస్సు సహకరించక పాకుతూ ఇబ్బంది పడుతూ వెళుతూ గుండం వద్ద విధులు నిర్వహిస్తున్న రాందాస్ కంటపడింది. జాతర సమయం 5గంటల వరకే ఉండటం. రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్న నేపథ్యంలో తన భుజాలపై ఎత్తుకొని అలసటను భరిస్తూ 3నుంచి 4కిలోమీటర్లు నడిచి బస్సు నిలిచే స్థలం వరకు తీసుకువచ్చారు. సురక్షితంగా ఆమెను బస్సు ఎక్కించడం గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఉన్నత అధికారులు, సామాజిక వేత్తలు ఆయనను అభినందిస్తున్నారు. 2022 సంవత్సరంలో కొండ చరియలు విరిగి గాయాలపాలు కావడంతో వారిని కూడా ఎత్తైన కొండలను దాటుకుంటూ వారిని భుజాలపై మోసుకొచ్చి వైద్య సదుపాయం కల్పించారు. ఆ కానిస్టేబుల్ అచ్చంపేట స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారు.

కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 25 : కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణం ఎల్లికల్ గ్రామంలో ఈజీఎస్‌కూలీల పని ప్రదేశంలో కూలీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వామపక్షాల ఉద్యమ పోరాట ఫలితంగానే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని ప్రమాదాలకు గురైతే నష్ట పరిహారాలతోపాటు ఇన్సూరెన్స్ వచ్చేలా చూడాలన్నారు. సంవత్సరంలో 200రోజుల పని దినాలను కల్పించాలని రోజు కూలీ 600 రూపాయలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

● వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీ

ఎల్లికల్ గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడుగా వినోద్, ఉపాధ్యక్షులుగా సిద్ధయ్య, మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా శివలింగం, సహాయ కార్యదర్శిగా బందిగమ్మ, కమిటీ సభ్యులుగా దేవమ్మ, జుబేదా, జంగయ్య, ఎల్లయ్య కృష్ణ, శీనయ్య, ఈశ్వరయ్య, చిన్నమ్మ, ఈశ్వరమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రతీ కార్యకర్త సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



బీరప్ప దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 25 : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గుంతతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు గోవిందు సహోదరుడు మూడవ మధు వివాహ వేడుకలో గురువారం పాల్గొని ఆశీర్వదించి అనంతరం ఇప్పలపల్లి కాంగ్రెస్ నాయకుడు చెన్నారెడ్డి నిర్మించిన గోదామును ప్రారంభించి మీతోపాటుగా మీ కుటుంబ సభ్యులను కాంగ్రెస్‌కు ఓటు వేయించాలన్నారు. ఈ సందర్భంగా కాసేపు కాంగ్రెస్ కార్యకర్తలతో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వివరాలు అడిగారు. గ్రామాల్లో మాయ మాటలు చెబుతూ ఓట్లను దండుకునే ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌ల అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో ఏకకాలంలో చేయనున్న రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తున్న, సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవూఫ్, లక్ష్మీనారాయణ, వెంకటరాములు, మనోహర, సహదేవ్, వరుణ్‌కుమార్, హనుమంతు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలు పూర్వీకుల చిహ్నాలు

పండుగలు పూర్వీకులు అందించిన ఆధ్యాత్మిక ఆచార సాంప్రదాయ చిహ్నాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని జమిస్తాపూర్ గ్రామంలో కురుమల ఆరాధ్య దైవం బీరప్ప పండుగలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, గౌరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సూర్యబాలగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కురుములు మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి



ఈవీఎంల కమిషనింగ్ గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్షి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంల కమిషనింగ్‌ను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఐడీవోసీ సముదాయంలోని సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 117 సెక్టోరియల్ అధికారులకు ఈవీఎంలకు సంబంధించి కమిషనింగ్, సీలింగ్‌లపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌లు పాల్గొని అధికారులకు గల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు సంబంధించి పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ నిబంధనలు తూచ తప్పకుండా కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. తదనంతరం ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు, ఎన్నికల విధులపై ఈవీఎంల పనితీరుపై పూర్తి అవగాహన కల్పించారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమం పూర్తైందని అధికారులు తెలిపారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులకు స్వాగతం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్న నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు రుచేష్ జైవన్షిను అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియో జకవర్గానికి నియమించబడిన ఎన్నికల సాధారణ పరిశీలకులుగా రుచేష్ జైవన్షి 2009 బ్యాచ్ మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారి, సాధారణ పరిశీలకులు పార్లమెంట్ నియోజకవర్గం స్థానం యొక్క ఎన్నికల సరళిని పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. సాధారణ పరిశీలకులు ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల ఎన్నికల పర్యవేక్షణ పరిశీలిస్తారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకై కొనసాగుతున్న ఏర్పాట్ల గురించి జనరల్ అబ్జర్వర్‌కు కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి తెలియజేశారు. గురువారం చివరి రోజు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కొనసాగిన నామినేషన్ల ప్రక్రియను సాధారణ పరిశీలకులు రుచేష్ జైవన్షి పరిశీలించి పలు సూచనలు అందజేశారు. జనరల్ అబ్జర్వర్ రుచేష్ జైవన్షి 8790015179 వాట్సాప్ ద్వారా కానీ మేసేజ్ రూపంలో కాని అభ్యర్థులు, ప్రజలు ఎవరైనా సమాచారం ఇవ్వవచ్చన్నారు. సోమశిల పర్యాటక అతిథి గృహంలో ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి 12గంటల సమయంలో నేరుగా కలుసుకుని ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అబ్జర్వర్లు పార్లమెంట్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ఎన్నికల సంబంధిత అంశాలను పరిశీలిస్తారని, నిర్ణీత సమయాల్లో పరిశీలకులను సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు.

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 25 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో, హామీల అమలులో పూర్తిగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ ఆరోపించారు. ప్రజలకు ఆరు గ్యారెంటీలను, రైతులకు రుణమాఫీని అమలుపర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పలువురు నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ 8 నుంచి 12 స్థానాల్లో విజయ దుందుభీ ఎగురవేయబోతుందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమన్నారు. ఆనయకు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 27న నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారని తెలిపారు. రోడ్ షోకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 5వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మతాల మధ్య విభజన తెచ్చి హిందువుల ఓట్లతో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగాన్ని మారుస్తామని పేర్కొంటున్నారని, రాజ్యాంగాన్ని మారుస్తే దేశంలోని ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే రిజర్వేషన్లు రద్దవుతాయన్నారు. ఇతర రాజకీయ, అన్ని రంగాల్లో వచ్చే అవకాశాలకు ఎస్సీ, ఎస్టీలు దూరమవుతారని అన్నారు. దేశంలో 52శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను ప్రజలు గుర్తించి బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి భాష తీరు ఏమాత్రం బాగాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, నాయకులు ఈశ్వరయ్య శ్రీను, భాస్కర్‌రావు, కృష్ణయ్య మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

చారకొండ, ఏప్రిల్ 25: అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ గుండె నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు హాజరయ్యారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తితే అందుకు అధికారులు ఆ సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

అదేవిధంగా గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఉపాధిహామి కూలీలకు పనులు కల్పించి వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని సూచించారు. ఎంపీడీవో ఇసాక్ హుసేన్, వైస్‌ఎంపీపీ నకినమోని బక్కమ్మయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యులు గ్యార లక్ష్మయ్య లక్ష్మణ్‌నాయక్, లలితబాల్‌సింగ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని వేడుకరావుపల్లితండాలో ఆ గ్రామ ప్రజలు బొడ్రాయి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకరావుపల్లితండా ప్రజలు గత రెండు రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమం ఉంటుందని ప్రజలు తెలిపారు.

● జడ్పీటీసీ సభ్యురాలి విరాళం

వేడుకరావుపల్లితండాలో బొడ్రాయి పండుగకు జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ చంద్రయ్య దంపతులు 20వేల 116రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, ఉప సర్పంచ్ శ్రీధర్‌రావు, నాయకులు అమ్రు నాయక్, బి.నిరంజన్, వి.శ్రీనివాసులు, బి.రవి, బి.చంద్రశేఖర్, జయరాజ్ పాల్గొన్నారు.

వరిని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 25 : రైతులు పండించిన వరిని ప్రభుత్వం సింగిల్ విండోల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పెద్దకొత్తపల్లి సింగిల్ విండో సీఈవో సిరాజ్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి సింగిల్ విండో పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు పండించిన వరిని మధ్య దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన కోరారు. ప్రభుత్వం క్వింటాల్ వరికి 2203 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్, ఏప్రిల్ 25 : కొల్లాపూర్‌లోని ఆర్టీసీ బస్సు డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉమాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు రవాణాపరమైన అంశాలపై తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

వేసవి తాపం ఈతతో ఉపశమనం



దేవునితిర్మలాపూర్‌లో గుండంలో ఈత కొడుతున్న చిన్నారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 25 : వేసవి తాపానికి తట్టుకోలేక చిన్నారులు బావులు, చెరువులు, వాగుల్లోకి ఈతకు వెళ్తున్నారు. నీళ్లున్న బావులు, చెరువులు, గుండం దగ్గర చిన్నారులు వెళ్లి ఈత కొడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో చిన్నారులు బావులు, చెరువులు, కుంటలు, గుండం దగ్గర ఎక్కువ సమయం నీటిలో ఈదుతున్నారు.

ఆదరిస్తున్న తాగునీరు, అంబలి కేంద్రాలు

- వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు



ప్రజలకు నీళ్లు పోస్తున్న యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 25: వేసవి తాపంతో తల్లడిల్లే ప్రజలకు మేమున్నాం అంటూ రక్షిత మహిళా సంఘం, రామ్‌రహీం లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత అంబలి, తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలు, ఆటో యూనియన్ సభ్యులు తమవంతు సేవలు అందిస్తున్నారు. ఉదయం మొదలు కొని సాయంత్రం వరకు ప్రధాన రహదారిపై వెళ్లే వారందరికి అంబలి పోసి వారి దాహార్తి తీరుస్తున్నారు. శ్రీశైలం నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి కోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో గత కొన్ని ఏళ్లుగా మంచినీళ్లతో పాటు ఉచిత అంబలి దానం నిర్వహిస్తున్నారు. గ్రామాల నుంచి తమ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు అంబలికేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

ఇంటింటా బీజేపీ ప్రచారం

ఉప్పునుంతల, ఏప్రిల్ 25: మండల పరిధిలోని తాడూరు గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ బీజేపీ నాయకులు కాకునూర్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు తిరుగుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా భరత్ ప్రసాద్ నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రాని కి తరలి వెళ్లారు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పేరు ప్రకటనపై హర్షం



అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్, ఏప్రిల్ 25 : వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు, తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు, తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, మునిసిపల్ పదవ వార్డు కౌన్సిలర్ షేక్.రహీంపాష, మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజలు మాట్లాడారు. పెంట్లవెల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహాయాదవ్, వీపనగండ్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, ఎండి.తాహేర్ పాష, మొలచింతలపల్లి మాజీ సర్పంచ్ కొమ్ము రాజు, రఘునాయుడు, బండారు స్వామి, లక్ష్మణ్, బాలరాజు, ఎస్‌కే.ఖాదర్ పాష, వెంకట్రాములు, సురేందర్, సందీప్, సూర్యనారాయణ, కిరణ్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

30న మహనీయుల జయంతి ఉత్సవాలు

కొల్లాపూర్, ఏప్రిల్ 25 : మాదిగల రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాదిగ రాజకీయ ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాదిగ రాజకీయ ఐక్య వేదిక నాయకులు, తెలంగాణ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మీసాల రాముమాదిగ, బీఆర్ఎస్ నాయకులు కాటం జంబులయ్య, నాయకులు లక్ష్మయ్య మాట్లాడారు. ఈ నెల 30న కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీ ఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజర వుతారని వారు పేర్కొన్నారు. నాయకులు కారంగి బ్రహ్మ య్య, కుర్మయ్య, సహదేవుడు, చిన్న నరసింహ, నాగరాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించిన కళాశాల బృందం

కొల్లాపూర్, ఏప్రిల్ 25 : ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులను గురువారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి పిన్సిపాల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన సీఈసీ గ్రూప్‌నకు చెందిన విద్యార్థిని కల్యాణి 915మార్కులు సాధించిందని, ఎంపీసీ మొదటి సంవత్సరంలో పౌరశాస్త్రంలో జి.గాయత్రి 100మార్కులకుగాను 99మార్కులు సాధించిందన్నారు. విద్యార్థినీతోపాటు ద్వితీయ సంవత్సరం సీఈసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన నస్రీన్‌ను శాలువాతో సత్కరించి ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు బయల్దేరిన బీజేపీ కార్యకర్తలు

తెలకపల్లి, ఏప్రిల్ 25 : బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా గురువారం తెలకపల్లి నుంచి నాగర్‌కర్నూల్‌కు కార్యకర్తలు బైకులపై తరలివెళ్లారు. అంతకు ముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు రమణారెడ్డి, బాబుసాగర్, రమేష్, నరేంద్రచారి, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మస్టర్లపై పంచాయతీ కార్యదర్శి సంతకాలు తప్పనిసరి

లింగాల, ఏప్రిల్ 25: ఉపాది పనులకు సంబంధించి మస్టర్లపై ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంతకాలు తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీల సంఖ్యను 150వరకు పెంచాలని అన్నారు. పనిచేసే కూలీల సంతకాలను కూడా ఎప్పటికప్పుడు మస్టర్లపై చేయించాలని, పనుల దగ్గర తాగు నీటి సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

వేసవి కాలం కావడంతో ఇప్పటి వరకు ఆయా ప్రదేశాలలో నాటిన మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను కోరారు. ప్రతీ రోజు గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులకు సంబంధించిన ఫోటోలు తీసి యాప్‌లో పెట్టాలని గ్రామాల్లో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. ఎంపీవో కర్నానాయక్, ఏపీవో హిమామ్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఏప్రిల్ 25 : వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహేష్‌యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహేష్‌యాదవ్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకుడు సంజుకుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సారా అమ్మే వ్యక్తిపై కేసు నమోదు

మన్ననూర్, ఏప్రిల్ 25: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో సారా అమ్మే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మన్ననూరు గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సోదాలు నిర్వహించగా, శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై రామావత్ శంకర్ అనే వ్యక్తి సారా అమ్ముతుండగా పట్టుకొని 5.5 లీటర్ల ను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.